# ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం: మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**● సీకేఎం మేటర్నిటీ హాస్పిటల్ , ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్**



**ఉమ్మడి వరంగల్, మే 20 (నేటి దర్శిని బ్యూరో):** ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా సీకేఎం మేటర్నిటీ హాస్పిటల్, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశం లో దేవాదాయ , అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని మాట్లాడుతూ ఆసుపత్రుల అభివృద్ధి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతుల విస్తరణ, సిబ్బంది అవసరాలు, ఆధునిక పరికరాల సమీకరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆసుపత్రులకు అవసరమైన ఆధునిక వైద్య పరికరాల కొనుగోలు, అత్యవసర వైద్య విభాగాల బలోపేతం, ప్రసూతి సేవల మెరుగుదల, కంటి వైద్య సేవలను విస్తరించడం, రోగులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం, తాగునీరు, పారిశుద్ధ్యం, పడకల సంఖ్య పెంపు, సిబ్బంది నియామకం వంటి పలు కీలక అంశాలను అధికారులు మంత్రి గారికి వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా మెరుగైన వైద్య సేవలు పొందేలా ఆరోగ్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులకు అందించే సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అలాగే నేత్ర వైద్యశాలలో ఆధునిక యంత్రాలు, నిపుణులైన వైద్యులు, శస్త్రచికిత్స సదుపాయాలు పెంపుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అదేవిధంగా ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రోగుల పట్ల వైద్య సిబ్బంది మరింత మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా సేవల నాణ్యత ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్లు, వైద్యాధికారులు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను ప్రారంభించిన చరికొండ సర్పంచ్.....



**కడ్తాల్, మే20 (నేటి దర్శిని);** కడ్తాల్ మండల పరిధిలోని సరికొండ గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్ బుధవారం ఉపాధి హామీ పనులను,ఉపాధి హామీ కూలీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. నీడ సౌకర్యం కోసం టెంట్లు ఉపయోగించాలని చెప్పారు. ఉదయం పూటనే పని పూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని కూలీలను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బల్వంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాషా,వార్డు సభ్యులు నరసింహ, బాలమని ,మంజుల,గౌరమ్మ, లాలయ్య, ఉమ, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కొమ్ము సురేష్ జన్మదిన వేడుకలు




**యాచారం, మే 20(నేటిదర్శిని ):** ఐఎన్టీయూసీ యాచారం మండల అధ్యక్షులు కొమ్ము సురేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అభిమానులు, కాంగ్రెస్ పార్టీ మరియు ఐఎన్టీయూసీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కొమ్ము సురేష్ కేక్ కట్ చేసి తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. స్థానిక కాంగ్రెస్ శ్రేణులు ఎన్ ఎన్ ఆర్ యువసేన అధినేత నాయిని నవీన్ రెడ్డి పాల్గొని ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కొమ్ము సురేష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, కార్మికుల పక్షాన నిలబడి మరిన్ని సేవలు అందించాలని పలువురు కార్మిక మరియు రాజకీయ నాయకులు ఆయనకు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు, మాజీ ఎంపిటిసి రాజేందర్ రెడ్డి, ఎన్ ఎన్ ఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు

**● అండర్ గ్రౌండ్ డ్రైనేజీ , సిసి రోడ్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**



**ఉమ్మడి వరంగల్, మే 20 (నేటి దర్శిని బ్యూరో):** ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ లో బాబు జగ్జీవన్ రావు బొమ్మ నుంచి లేబర్ కాలనీ 100 ఫీట్ల రోడ్డు వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపుల నిర్మాణ పనులకు బాలాజీ నగర్ జంక్షన్ వద్ద సుమారు 6 కోట్ల రూపాయలు నిధులతో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు.
అలాగే శ్రీనివాస కాలనీ లో సుమారు 50 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్ , డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపరచడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు మురుగునీటి సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుందని, పరిసరాలు పరిశుభ్రంగా మారుతాయని అన్నారు. గతంలో వర్షాకాల సమయంలో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ పనులను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు రాజీ పడకుండా సమయానికి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి దశలవారీగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో వరంగల్ నగరాన్ని మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, మహిళలు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదికృత డీలర్ల వద్దే విత్తనాలను కొనండి...



**ఆమనగల్లు,మే20(నేటి దర్శిని);** ఆదికృత డీలర్ల వద్దే విత్తనాలను కొనాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం ఆమనగల్లు పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి పత్తి,కందులు,వరి, విత్తనాల విలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు గుర్తింపు పొందిన అధికారిక డీలర్ల వద్దే విత్తనాలను కొనాలని సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా రసీదును తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్ల బిల్లులను పంట కాలం ముగిసే వరకు భద్రపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు,తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ పెరమాల్ల ఏడుకొండలకు పీహెచ్ డి ప్రధానం





**గుర్రంపోడు,మే20 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం జునుతుల గ్రామానికి చెందిన పెరమాల్ల ఏడుకొండలు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి సేంద్రీయ రసాయన శాస్త్ర విభాగంలో విజయవంతంగా పరిశోధన పూర్తి చేసి విద్యావారధి (పీహెచ్‌డీ) పట్టా పొందారు. ఆయన "రాగి/పల్లాడియం ఉత్ప్రేరక వాహకం ద్వారా జీవ-క్రియాశీల ఇండోల్/ బెంజోఫ్యూరాన్ నిర్మాణాలు" అనే అంశంపై పరిశోధనలు నిర్వహించారు. అంతర్జాతీయ గుర్తింపు -- జాతీయ ర్యాంక్: ఆయన పరిశోధనలకు గుర్తింపుగా 4 ప్రముఖ అంతర్జాతీయ విజ్ఞాన పత్రికలలో వ్యాసాలు ప్రచురితమయ్యాయి. గతంలోనే ఆయన జాతీయ స్థాయి అర్హత పరీక్ష (సిఎస్ఐఆర్-జేఆర్ఎఫ్) లో దేశవ్యాప్తంగా 116వ ర్యాంక్ సాధించారు.

**గురువులకు కృతజ్ఞతలు**

తన విజయానికి మార్గదర్శి డా. కె. శివకుమార్, కుటుంబ సభ్యులు, తండ్రి మల్లయ్య కారణమని ఏడుకొండలు తెలిపారు. ముఖ్యంగా పదవ తరగతిలో తనకు గణితంలో ప్రత్యేక పాఠాలు చెప్పి, బడికి వెళ్లని సమయంలో ఎంతగానో ప్రోత్సహించిన గుర్రం వెంకటయ్య గారిని ఆయన భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. వారిచ్చిన ప్రేరణతోనే తాను ఈరోజు ఈ స్థాయికి చేరానని కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చి ఉన్నత విజయం సాధించిన ఏడుకొండలును పలువురు అభినందించారు.

# టీజీటీసి చైర్మన్ ను ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ నాయకులు...





**కడ్తాల్, మే20(నేటి దర్శిని):** తెలంగాణ గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్ గా సూదిని రామ్ రెడ్డి నియమితులయ్యారు. ప్రమాణ స్వీకార అనంతరం కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. కడ్తాల్ మండల కేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్ సూదిని రామ్ రెడ్డిని బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు షాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు. అదేవిధంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ని శాలువాలతో పూలమాలలతో సన్మానించారు. అనంతరం మైసిగండి మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ సిబ్బంది,నాయకులు చైర్మన్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిక్ష నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ,యాట నరసింహ కడ్తాల్ సర్పంచ్ రాయకంటి బిక్షపతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణపై అవగాహన

**● అఖిలపక్ష నాయకులతో ఆర్డీవో సమావేశం**

**దేవరకొండ, మే 20 నేటి దర్శిని ప్రతినిధి :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై బుధవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో పద్మప్రియ అధ్యక్షతన అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. మృతిచెందిన వారి ఓట్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణకు ఈ కార్యక్రమం ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సర్ మ్యాపింగ్‌కు సంబంధించిన నియమ నిబంధనలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఓటరు జాబితా పారదర్శకత, ఖచ్చితత్వం కోసం సర్ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



సమావేశంలో అఖిలపక్ష నాయకులు, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

● రూ.50 వేల జరిమానా విధించిన ప్రత్యేక కోర్టు




**మిడ్జిల్, మే 20, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా బాలసదన్, మెట్టుగడ్డ ప్రాంతంలో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో పోక్సో ప్రత్యేక కోర్టు నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.50,000 నగదు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినది. కేసు వివరాల ప్రకారం, నిందితుడు మున్నూరు లక్ష్మయ్య అలియాస్ లక్ష్మయ్య, తండ్రి చెన్నయ్య, వృత్తి రీత్యా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడిగా విధులు నిర్వహిస్తూ, కోయిలకొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందినవాడు. విధుల నిమిత్తం బాలసదన్‌కు వచ్చిన సమయంలో మైనర్ బాలికను బెదిరించి, బలవంతంగా లైంగిక దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైనది. బాధితురాలు జరిగిన విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియజేయడంతో తేది 17.03.2024 నాడు మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయబడినది. అనంతరం పోలీసులు బాధితురాలి వాంగ్మూలాలు, వైద్య పరీక్షలు, ఫోరెన్సిక్ ఆధారాలు మరియు ఇతర సాక్ష్యాధారాలను సేకరించి పకడ్బందీగా దర్యాప్తు నిర్వహించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన స్పెషల్ కోర్ట్ ఫర్ పోక్సో కేసెస్ జడ్జి శ్రీమతి తమన్ రాజరాజేశ్వరి గారు నిందితుడిని దోషిగా తేల్చి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ గాంధీనాయక్, పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. జాన్, కోర్టు లైజన్ అధికారి ఏఎస్ఐ బాలకృష్ణ, కోర్టు డ్యూటీ అధికారులు పీసీలు కృష్ణ, రహీం, శంకర్, అశోక్ రెడ్డి మరియు కేసు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అభినందించారు.

## ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్



**నిడమనూరు, మే 20 (నేటి దర్శిని):** నియోజకవర్గ కేంద్రమైన నిడమనూరు తాసిల్దార్ ఆఫీస్ లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణను భారత ఎన్నికల సంఘం రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 మరియు ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950 లోని సెక్షన్ 21 ప్రకారం, ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నల్లగొండ ఆదరణ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు ఓటరు జాబితా సవరణకు సంబంధించిన వివిధ దశలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తమన్నారు ఓటర్ జాబితా సవరణలపై ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ వివిధ రాజకీయ పక్షాల నాయకులకు వివరించారు. జూన్ 15 నుండి జూన్ 24 వరకు సిబ్బందికి శిక్షణ, ప్రింటింగ్ తదితర ఏర్పాట్లు చేపట్టనుండగా, జూన్ 25 నుండి జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఇప్పటికే ఉన్న ఓటర్లకు ముందుగా కొంత సమాచారం నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను రెండు ప్రతులుగా అందజేస్తారు. ఫారాలను ఎలా నింపాలో ఓటర్లకు మార్గనిర్దేశం చేస్తారు. ఒకవేళ ఇల్లు తాళం వేసి ఉంటే కనీసం మూడు సార్లు బి.ఎల్.ఓలు సందర్శిస్తారు. ఓటర్లు తమ ఫారాలను ఆన్‌లైన్‌లో కూడా డౌన్‌లోడ్ చేసుకొని సమర్పించవచ్చు. బి ఎల్ ఓ లు సందర్శించే తేదీలను ముందుగానే ప్రచారం చేయనున్నారు. నింపిన ఫారాలను బిఎల్‌ఓ లకు అందజేసిన తరువాత ఓటర్లకు అకనాలెడ్జ్మెంట్ ఇవ్వబడుతుంది. అంతేకాకుండా, ఓటర్లు తమ పేరు లేదా తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మల పేర్లు 2002 ప్రత్యేక ఓటరు జాబితాలో ఉన్నట్లయితే ఆ వివరాలను కూడా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ తహసీల్దారులు జంగాల కృష్ణయ్య...... రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

## భార్యాభర్తలకు నివాళులను అర్పించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి...



**ఆమనగల్లు మే20(నేటి దర్శిని):** ఆమనగల్ పట్టణంలోని శ్రీకాంత్ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు నారాయణ గౌడ్ లక్ష్మమ్మ దంపతుల మృతదేహాలకు బుధవారం కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులను అర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణ గౌడ్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య లక్ష్మమ్మ బుధవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలియడంతో భార్యాభర్తలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, ఆమనగల్ మాజీ సర్పంచ్,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కో ఆప్షన్ సభ్యుడు ఎండి అబ్దుల్ ఖాదర్, తదితరులు నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను వారు పరామర్శిస్తూ తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.

## వరంగల్ రీజనల్ ఐ హాస్పిటల్ లో సీసీ రోడ్లు ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు


● సికేం ఆస్పత్రిలో కొత్తగా పునరుద్ధరించిన ఓపి బ్లాక్ లను ప్రారంభించిన మంత్రి



**ఉమ్మడి వరంగల్, మే 20 (నేటి దర్శిని బ్యూరో):** రోగులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వము వైద్యశాఖ కు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ నగరంలోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యం ఆసుపత్రిలో రూరల్ డెవలప్మెంట్ నిధులతో నిర్మించిన అంతర్గత సిసి రోడ్లను మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నందుకు వచ్చిన మంత్రి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తో కలిసి ఈ పనులను ప్రారంభించారు. అలాగే వరంగల్ నగరంలోని సికేం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో కొత్తగా పునరుద్ధరించిన ఓపి బ్లాక్ లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇరుకుగా ఉన్న ఓపి బ్లాక్ లను రోగుల సౌకర్యార్థం ఆధునికరించి వాటి సంఖ్యను పెంచినట్లు తెలిపారు .ఈ నూతన బ్లాక్ లతో గర్భిణీలకు ప్రసూతి వైద్య సేవలు మరింత మెరుగ్గా అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ భరత్ కుమార్, ఆస్పత్రి ఇన్చార్జి సూపర్ ఇండెంట్ మహాలక్ష్మి , డాక్టర్లు, సిబ్బంది, టి పి సి సి చేనేత సెల్ అధ్యక్షులు చిప్ప వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటింటికి త్రాగే నీరు ను అందించడమే ప్రభుత్వ లక్ష్యం....

● ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్..



**ఆమనగల్లు,మే20(నేటి దర్శిని):** ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి, నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ పేర్కొన్నారు. ఆమనగల్లు మండలంలో మేడిగడ్డ తండా గ్రామపంచాయతీ పరిధిలోని చెప్తాత్త తండాలో ఉన్న మంచినీటి ట్యాంకును బుధవారం ఉప సర్పంచ్ విజయ రాథోడ్ పరిశీలించారు. గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని ఉద్దేశంతో సిబ్బందితో కలిసి ట్యాంకును శుభ్రపరిచే పనులను చేపట్టారు. నీటి నిల్వ ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని, ట్యాంకు నిర్వహణను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, లాలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## పద్మానగర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**చంపాపేట్, మే20 (నేటి దర్శిని):** చంపాపేట్ డివిజన్ పరిధిలోని పద్మా నగర్ కాలనీ వద్ద గతంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నిధులతో మంజూరైన బాక్స్ డ్రైన్స్ పనులు వివిధ కారణాల వల్ల ఆలస్యమయ్యాయి. ఈ నేపథ్యంలో చుట్టుపక్కల కాలనీవాసులు కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసి, మిగిలిపోయిన బాక్స్ డ్రైన్స్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. దానిలో భాగంగా ఈరోజు పద్మా నగర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, రాబోయే వర్షాకాలానికి ముందుగానే బాక్స్ డ్రైన్స్ పనులను వెంటనే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే పలుచోట్ల మ్యాన్ హోల్స్ ధ్వంసమైన నేపథ్యంలో కొత్త మ్యాన్ హోల్స్ నిర్మాణ పనులను కూడా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణంలో ఉన్న ట్రంక్ లైన్ పద్మా నగర్ కాలనీ, పద్మా ఎంక్లేవ్, ఉదయ నగర్ కాలనీతో పాటు గూండా ఎం.ఆర్.ఆర్. కాలనీ ప్రాంతాల ట్రంక్ లైన్‌కు అనుసంధానమవుతుందని తెలిపారు. ఈ ట్రంక్ లైన్ నిర్మాణం సకాలంలో పూర్తైతే స్థానిక ప్రజలకు వర్షపు నీరు, మురుగునీటి సమస్యల నుంచి శాశ్వత ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారస యువ నాయకులు గండికోట శ్రీనాథ్,కృష్ణమాచారి,చీర శ్రీనివాస్ మరియు చుట్టుపక్కల కాలనీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు జయవర్ధన్ రెడ్డి,సుధాకర్ రెడ్డి,బద్రీనాథ్,శ్రవణ్ కుమార్ రెడ్డి, నాగేష్,అమరేందర్ సాగర్, నర్సింహా, విజయ్,దాసు,ఆనంద్,సత్యనారాయణ,జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ నగరంలో రూ 2 లక్షల అక్రమమద్యం జెసిబి తో ధ్వంసం



**ఉమ్మడి వరంగల్, మే 20 ( నేటి దర్శిని బ్యూరో)** అక్రమ మద్యం రవాణా, నిలవలపై ఉక్కు పాదం మోపుతామని సిఐ రమేష్ హెచ్చరించారు .వరంగల్ నగరంలోని మిల్స్ కాలనీ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2 లక్షల విలువైన మద్యాన్ని ఎక్సైజ్ శాఖ ఆదేశాల మేరకు పోలీసులు జెసిబి సాయంతో ధ్వంసం చేశారు . మిల్స్ కాలనీ పోలీసుల సోదాల్లో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యాన్ని జెసిబి సాయంతో నుజ్జు నుజ్జు చేశారు. ఎక్కడైనా ఇలాంటి చర్యలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు ,ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.


## నూతన ఆర్డీవో పి పద్మప్రియ కు ఘన సన్మానం

● బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధికి కృషి చేయాలి




**దేవరకొండ, మే 20 (నేటి దర్శిని):** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా దేవరకొండ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన పి. పద్మప్రియ ను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన దేవరకొండకు ఆమె రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు అధికంగా ఉన్నారని, వారి అభివృద్ధికి కృషి చేస్తూ ప్రభుత్వానికి – – ప్రజలకు మధ్య వారధిగా నిలిచి మెరుగైన సేవలు అందించాలని కోరారు.జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, రెడ్డి కోటేశ్వరరావు, లౌడియ భాషా నాయక్, గరిడి విజయభాస్కర్, బచ్చనబోయిన శివ, టి. మల్లేష్, ఎం. ఖలీక్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం కీలకం : కలెక్టర్ సి.నారాయణ రెడ్డి





**రంగారెడ్డి, మే 20 (నేటి దర్శిని):** ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే జిల్లా యంత్రాంగం మరియు రాజకీయ పార్టీల ముఖ్య లక్ష్యంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు.బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లా యంత్రాంగం పూర్తి పారదర్శకతతో, ఖచ్చితమైన విచారణతో బాధ్యతాయుతంగా పని చేస్తోందన్నారు. రాజకీయ పార్టీలు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలనలు చేయాలని సూచించారు. ప్రతి రాజకీయ పార్టీ తక్షణమే బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని కోరిన కలెక్టర్, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జూన్ 15 నుంచి బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఇంటింటి సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు.

**బీఎల్ఓల పాత్ర కీలకం**

కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా ప్రక్షాళనలో బూత్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. బీఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే కొత్త ఓటర్ల నమోదు చేపడతారని తెలిపారు. అలాగే మరణించిన వారి పేర్ల తొలగింపు, వలస వెళ్లిన వారిని గుర్తించడం, అర్హులైన కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడం వంటి బాధ్యతలు కూడా బీఎల్ఓలవేనన్నారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే ప్రతి యువతి, యువకుడు ఫామ్-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, సవరణలు, చేర్పుల కోసం ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

**రాజకీయ పార్టీల సూచనలు**

సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు, విజ్ఞప్తులు చేశారు. బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే ఓటర్లకు అదే భవనాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ ఎన్నికల దృష్ట్యా నకిలీ ఓటర్లు, మరణించిన వారి పేర్ల తొలగింపుపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బీఎల్ఓ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని, ఒకే ఇంటి నంబర్‌పై 50 మందికి పైగా ఓటర్లు నమోదైన కేసులను విచారించాలని కోరారు. ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ముందు బీఎల్ఓలు, పర్యవేక్షకులు, బీఎల్ఏలకు సమగ్ర శిక్షణ ఇవ్వాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు చేసిన సూచనలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పరిశీలిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. నకిలీ మరియు మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన చోట్ల కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, భారీ సంఖ్యలో ఓటర్లు నమోదైన ఇళ్లపై విచారణ చేపట్టేందుకు సంబంధిత ఎన్నికల నమోదు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు వచ్చే వారంలో బీఎల్ఓలు మరియు పర్యవేక్షకులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలు, బీఎల్ఓలు మరియు పర్యవేక్షకుల సమాచారం రాజకీయ పార్టీలతో పంచుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ప్రతినిధులు, జిల్లా రెవెన్యూ అధికారి శారద, ఆర్డీఓలు అనంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కంచి కామకోటి పీఠాధిపతి, మంత్రి కొండా సురేఖ





**ఉమ్మడి వరంగల్, మే20(నేటి దర్శిని బ్యూరో):** ఓరుగల్లు ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళి అమ్మవారిని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర్ విజయేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

## 40 లక్షల నిధులతో చేపట్టనున్న అంతర్గత రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, మే20(నేటి దర్శిని బ్యూరో):** ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు ప్రతిరోజు ప్రజలతో మమేకమై అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గం పరిధిలోని విజయ పాల్ కాలనీ రోడ్ నెంబర్2లో ఎస్ డి ఎఫ్ నిధుల నుంచి రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేవలం హామీలు ఇచ్చి మర్చిపోయే రాజకీయాలు తమవి కావని, ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తున్నానని, నియోజకవర్గ అభివృద్ధికి వందల కోట్లు వెచ్చించి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బీసీ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా గరిడి విజయభాస్కర్ ఎన్నిక

- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న నూతన అధ్యక్షుడు



**దేవరకొండ, మే 20 (నేటి దర్శిని):** దేవరకొండ పట్టణంలో నిర్వహించిన బీసీ నియోజకవర్గ ఉద్యోగుల సంఘం సమావేశంలో గరిడి విజయభాస్కర్ ను ఏకగ్రీవంగా బీసీ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ గరిడి విజయభాస్కర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ బీసీ ఉద్యోగస్తులను ఐక్యం చేసి ఉద్యోగస్తులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు సాధించడం, హెల్త్ కార్డులు, కారుణ్య నియామకాలు, ఉద్యోగుల రెగ్యులరైజేషన్, బదిలీలు, సకాలంలో వేతనాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, పున్న బిక్షమయ్య, నటువ సుధాకర్, బచ్చనబోయిన శివ, టి. మల్లేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ జన్మదిన వేడుకల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం



**ఎల్బీనగర్, మే20 (నేటి దర్శిని):** పిసిసి మాజీ కార్యదర్శి, ఎల్బి నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా ఎల్బి నగర్ యువనాయకులు ముద్దగౌని మనీష్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాహెబ్‌నగర్ డివిజన్ పరిధిలోని గౌతమి నగర్ కాలనీలో ఉన్న శాంతినికేతన్ మానసిక వికలాంగుల ఆశ్రమంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆశ్రమంలోని వికలాంగులకు ఆహారం పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సమాజంలోని నిరుపేదలు, వికలాంగులకు సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ ఫౌండేషన్ నిర్వాహకులు బాలేశ్వర్, శాండీ, సోను యాదవ్, ఆశీష్ చౌదరి, సన్నీ, అంజి, వంశీ, గౌతమ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్‌లో ఘనంగా రాజ్ కోట బిర్యాని సెంటర్ ప్రారంభం

- రాజ్ కోట బిర్యాని సెంటర్‌ను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్



**నాగోల్, మే20 (నేటి దర్శిని):** నాగోల్ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజ్ కోట బిర్యాని సెంటర్ ను నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ప్రాంతాల్లో కొత్త వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం అభినందనీయమని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ వ్యాపారాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని యాజమాన్యానికి సూచించారు. అనంతరం రాజ్ కోట బిర్యాని సెంటర్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతనంగా ప్రారంభమైన సెంటర్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్ యాదవ్, నరేష్ యాదవ్, రాము గౌడ్, సంతోష్ కుమార్, శివ కుమార్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత




**కరీంనగర్ రూరల్, మే 20 (నేటి దర్శిని):** చొప్పదండికి చెందిన వోల్లల శివకుమార్ తన ఓపో సెల్‌ఫోన్‌ను బొమ్మకల్ డివిజన్‌లోని ఎస్ఎఫ్ఎస్ ఫంక్షన్ హాల్ వద్ద పోగొట్టుకున్నారు. ఈ విషయమై ఆయన కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సి.ఇ.ఐ.ఆర్ టెక్నాలజీ సహాయంతో ఫోన్‌ను ట్రేస్ చేసి హుస్నాబాద్‌లో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి ఆ ఫోన్‌ను యజమాని వోల్లల శివకుమార్‌కు అందజేశారు.ఫోన్ ట్రేస్ చేయడంలో కృషి చేసిన టెక్ టీం సభ్యులు కానిస్టేబుల్ రాంసాయి, సుప్రియలను సిఐ నిరంజన్ రెడ్డి అభినందించారు. పోలీసుల వేగవంతమైన చర్యతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ యజమానికి తిరిగి చేరింది.

## జూనూతల స్టేజి వద్ద షార్ట్ సర్క్యూట్ తో ఎర్రచందనం తోట దగ్ధం

- 10 లక్షల మేర ఆస్తి నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడి ఆవేదన



**గుర్రంపోడు,మే 20(నేటి దర్శిని):** నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల పరిధిలోని జూనూతుల స్టేజి వద్ద గల దేవరకొండకు చెందిన దొడ్డి గిరి యొక్క ఆరు ఎకరాల ఎర్రచందనం తోట యందు జరిగిన విద్యుత్ ఫేస్ టు ఫేస్ షార్ట్ సర్క్యూట్ వల్ల 6000 ఎర్రచందనం మొక్కలు దగ్ధమైనట్టు దొడ్డి గిరి బంధువు మురారి శెట్టి అంజయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తోటలో ఉన్న విద్యుత్ స్తంభం వైర్లు ఫేస్ టు ఫేస్ అయి షార్ట్ సర్క్యూట్ జరగడంతో అగ్ని ప్రమాదం సంభవించినట్టు తెలిపారు. తోట లోపల ఉన్న డ్రిప్పు మరియు పైపులైన్లు అదేవిధంగా 6000 ఎర్రచందనం మొక్కలకు సంబంధించి సుమారు 10 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం తరపున ఆదుకొని తమకు న్యాయం చేయాలని ఆయన బాధితుడు దొడ్డి గిరి తరుపున కోరారు.

## గుర్రంపోడు కేజీబీవీ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

- ప్రత్యేక అధికారిణి డి. విజయశ్రీ




**గుర్రంపోడు మే 20 (నేటి దర్శిని):** నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి 6,7,11 తరగతులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రత్యేక అధికారిణి డి.విజయశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారిణి డి. విజయశ్రీ మాట్లాడుతూ.. గుర్రంపోడు కేజీబీవీ కళాశాలలో 6 వ తరగతిలో 40 సీట్లు,7 వ తరగతిలో 20 సీట్లు (ఇంటర్మీడియట్) 11వ తరగతి కంప్యూటర్ సైన్స్ కోర్సు నందు 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. తమ కళాశాలలో అర్హులైన ఉపాధ్యాయ, అధ్యాపక బృందం కలదని, విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు,నోటు పుస్తకాలు,యూనిఫామ్ అందజేయబడుతుందని, అదే విధంగా కంప్యూటర్, క్రాఫ్ట్ విద్య, ఆత్మ రక్షణ కొరకు కరాటే నేర్పబడునని,మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించబడుతుందని మండల పరిధిలోని తల్లిదండ్రులు విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించినట్లయితే వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తామని తెలియజేశారు.

